# ఋణవిముక్తి

సోమంచి రామం

నానిబాబు గుర్తు వచ్చినప్పుడల్లా నా మనస్సులో కలిగేభావాలు, అనుభూతులు ఇన్నీ అన్నీ కావు. అతని తలంపు రాగానే నా మనస్సు క్షణంలో ఆగ్రహావేశాలతో ఊగిపోయేది. మరుక్షణంలోనే అతనిపై ఎంతో జాలి కలిగేది. కాకపోతే చక్కగా చదువుకుని పైకివచ్చి డాక్టరు అవుతాడని ఆశించిన నానిబాబు చదువులో పైకి రాకపోగా జీవితంలోనే అడుక్కుపోయి వీథులవెంట అడుక్కులినే పరిస్థితికి దిగజారిపోయాడంటే అతనిపై జాలిగాక మరింకేం కలుగుతుంది? అతనిపై నేను ఉంచుకున్న ఆశల్ని, ఆశయాల్ని అన్నిటిని వమ్ముచేసేసి నాకు తీరని ఆశాభంగం కలిగించినపుడు ఆగ్రహావేశాలు రాక ఏం చేస్తాయి? కాని మళ్లీ అంతలోనే నా మనస్సు నన్ను శాంత పరిచేది. అతడు నా జీవితానికి పరోక్షంగా చేసిన సహాయం! అదే నన్ను ఋణ విముక్తుణ్ని చేసింది. నేను ఈ లోకంలో ఉండ గానే ఋణగ్రస్తుడనయిపోకుండా చేసి, నన్నా ఋణ బాధనుంచి విముక్తి చెయ్యడానికే ఓ సాధనంగా నానిబాబు సాక్షాత్కరించాడు. ఆనాడు నానిబాబుకి ఆ ముప్ఫైరూపాయలు సహాయం చెయ్యకపోతే ఇక నాకు ఎన్నటికీ ఋణవిముక్తి అయ్యేదికాదేమో!

* * *

ఉన్నతాశయాలతోను, ఉత్తమాదర్శాలతోను కూడు కున్న ఉపాధ్యాయవృత్తిలో నేను కొత్తగా చేరిన రోజులవి. ప్రతి విద్యార్థికి నచ్చే ఉపాధ్యాయు డొకడు ఉండేట్లుగానే ప్రతి ఉపాధ్యాయుడికి ఏదో ఒక విద్యార్థిమీదో, విద్యార్థినిమీదో అభిమానం ఉండితీరుతుంది! ఆ అభిమానం ఎందుకు కలుగుతుంది? ఎలా కలుగుతుంది? అంటే చెప్పటం కష్టం! ఆ విద్యార్థి చదువులో చురుకు కావచ్చు, నడతలో మంచి కావచ్చు, ఆటల్లో ఫస్టు కావచ్చు. అన్నిటికి మించి తానంటే ఆ విద్యార్థికి ఎక్కువ గురి, లక్ష్యము ఉండవచ్చు. వీటిల్లో ఏ ఒక్క కారణమున్నా చాలు, ఆ ఉపాధ్యాయుడికి ఆ విద్యార్థిమీద ఎక్కడలేని ప్రేమానురాగాలు పుట్టుకువస్తాయి. అలాగే నాకు నానిబాబంటే ఎందుకో చెప్పలేని వాత్సల్యం ఏర్పడింది. అప్పట్లో నానిబాబు ఫిఫ్తుఫారం చదువుతూండేవాడు. కుర్రాడు చూస్తే చాలా బుద్ధిమంతుడుగాను, చురుకు గాను కనిపించాడు. దానికి తగ్గట్టు నా సబ్జక్టు లెక్కల్లో ఫస్టుమార్కు అతనిదే! దాంతో అతనంటే నాకు దినదినానికి అభిమానం ఎక్కువ కాసాగింది. అతనికి నే నేరకంగాను సహాయపడక పోయినాడే అతనికి నేనంటే ఎంతో గౌరవంగా ఉంది. సహాయం అంటే ఆర్థిక సహాయమేకాదు, మాట సహాయంకూడాను! పరీక్షల్లో మాట సహాయం చేసి పిల్లల మెప్పు పొందామని గొప్ప చెప్పు కొనేవాళ్లు, మార్కులు వేసి సహాయం చేశామని పిల్లలకు ద్రోహంచేసేవాళ్లు లేకపోలేదు. నేను అలాటి సహాయాలు ఏం చెయ్యకపోగా, ఓసారి పరీక్షల్లో నానిబాబు తెలియక పక్కవాడి పేపరు చూస్తూంటే వెంటనే రిపోర్టు చేసి ఆ పరీక్ష రాయకుండా బయటికి పంపించేశాను. అయినా నానిబాబుకి నామీద గౌరవం పెరిగిందేకాని తగ్గలేదు. అందుకు తార్కాణం ఇదే. నన్ను ఆ మరుసటి సంవత్సరం పక్కగ్రామానికి బదిలీ చేశారు. నాకోసమే అన్నట్టుగా నానిబాబుకూడా టి. సి. తీసుకొని ఆ గ్రామంలోనే చేరాడు. అందు మూలంగా రోజుకు నాలుగైదుమైళ్ళు నడిచి వచ్చే వాడు. ఆ సంవత్సరం స్కూలుఫైనలు అతి సులువుగా మంచి మార్కులతో పాసయాడు. ఆ తరవాత కాలేజీలో చేరటానికని బెజవాడ వెళ్లాడు. నానిబాబు పెద్దంతగా ఉన్నవాడుకాదు. ఏదో తిండికి లోటులేని సామాన్య రైతుకులంలో పుట్టిన కుర్రాడు. వాళ్ల తండ్రి పైకివస్తాడనే ధైర్యంతో కష్టపడి చదివించాలని కాలేజీలో చేర్పించాడు. నానిబాబు కాలేజీలో చేరాక నాకు, అతనికి పరిచయం కొంత తగ్గింది. ఓసారి పనిమీద విజయవాడ వెళ్లాను. గవర్నరుపేట సెంటర్లో కనపడ్డాడు నానిబాబు.

"ఎప్పుడు వచ్చారు, మేస్టారూ?" అన్నాడు.

"పొద్దున్న వచ్చానయ్యా. కులాసా? ఎలా ఉంది చదువు?" అని ప్రశ్నించాను.

"బాగానే చదువుతున్నానండి! రండి, రూముకి వెడదాం!" అంటూ రూముకు తీసుకువెళ్లాడు.

రూము తాళం తీసి గబగబా లోపలికి వెళ్లి గదిలో కిందపడిఉన్న సిగరెట్లను కాలితో ఓ మూలకు కనపడ కుండా తోసెయ్యబోయాడు. ఆ విషయాన్ని పసిగట్టిన నేను వెంటనే లోపలికి వెళ్లకుండా బయట దేన్నో చూస్తున్నట్లు నటిస్తూ నిలబడిపోయాను. అంతా శుభ్రంచేసి సిద్ధం చేశాక "రండి, మేస్టారూ!" అన్నాడు నానిబాబు.

"ఆ!... ఆ!... వస్తున్నా!... వస్తున్నా!..." అంటూ లోపలికి వెళ్లాను.

మడతమంచంమీద పక్కదులిపి శుభ్రంగా వేశాడు. కూర్చున్నాను. గది అంతా చుట్టూ కలయచూశాను. ఓ మూల మంచినీళ్ల కూజా, దానిమీద గాజుగ్లాసు! గోడని రెండు మూడు కాలండర్లు — శతదినోత్సవాల సందర్భంలో ప్రత్యేకంగా వెయ్యబడిన సినిమా కాలండర్లు సినిమాతారల కాలండర్లు — ఉన్నాయి. అలమారాలో పుస్తకాలు అన్నీ చిందరవందరగా ఉంటే నాకు చిరాకని తెలుసు నానిబాబుకి! అందుకే పాపం, గబగబా కనిపించకుండా పుస్తకాలు సర్దుతూ మాటల్లోకి దింపాడు.

"పాపాయి కులాసాండి!" అన్నాడు.

"కులాసాయే! మార్కు లెలా వస్తున్నాయి?" అన్నాను.

"ఫరవాలేదండి! ఫిఫ్టీలపైన వస్తున్నాయి" అన్నాడు.

నిజమో అబద్ధమో అని శంకించవలసిన అవసరం అప్పట్లో కలగలేదు. కాని మనిషి పద్ధతి కొంచెం మారినట్లు మనస్సులో మెదులుతూంది!

"బాగా చదవాలి ఇంకా! క్లాసు రావాలి!" అన్నాను.

"అలాగేనండి! కూర్చోండి ఇప్పుడే వస్తాను" అంటూ రివ్వున బయటకు పోయాడు.

పట్టణ వాతావరణపు మోజులో పడి చదువు అశ్రద్ధ చేస్తున్నట్లుగా అనిపించింది నాకు. సిగరెట్లు అలవాటయ్యాయేమోనని అనుమానం వేసింది. అడిగేస్తే!...ఏమో!.. ఏ స్నేహితులన్నా వచ్చి కాల్చి పారేశారేమో! తొందరపడి అడగటం తప్పుకాదూ! నానిబాబే సిగరెట్లు కాలుస్తూంటే ఏ పుస్తకాల చాటు నన్నా సిగరెట్టు పెట్టె ఉండకపోతుందా అని అలమారా అంతా వెతికాను! ఎక్కడా ఏం దొరకలేదు! ఊ! తొందరపడి అడిగేసి అతని మనసు నొప్పించానుకాదు! నయమే! అందుకే అన్నారు, తొందరపడి ఏ పని చేయ రాదూ అని! సమాధానపరిచింది మనసును అంతరాత్మ! 'అయినా ఒకవేళ నిజంగా అతను సిగరెట్లు కాలు స్తూంటే, అతని పుస్తకాల మధ్యలో సిగరెట్టుపెట్టె దొరికితే ఏం చేసేవాడివి?' అని మళ్ళీ ప్రశ్నించింది అంతరాత్మ! 'ఏం చేస్తానా? పట్టుకుని చెవి మెలిపెట్టి నాలుగు కేకలేసి అవసరమైతే నాలుగు కొట్టి గట్టిగా బుద్ధి వచ్చేలా మందలిస్తాను' అంది మనసు! 'అలాగా! అలా చెయ్యగలవేం, పాపం! అతనికి, నీకు ఏం సంబంధం అని చేస్తావు? అతనేం నీ దగ్గిర బంధువా? లేక నీ తమ్ముడా? కన్నకొడుకునే ఈ రోజుల్లో తల్లితండ్రులు మందలించలేకపోతున్నారే, అలాంటిది ఏ బంధుత్వమూ, ఏ సంబంధమూ లేని అతన్ని నీవు నిలదీసి మందలించగలవా? ఏదో నీమీద గౌరవభావంతో గురుత్వం ఉంచుతున్నాడుకదా అని నీ కింత చొరవా?' అంది అంతరాత్మ. నిజమే! ఏ అధి కారంతో అతన్ని నేను కేకలు వెయ్యగలను? ఏమని మందలించగలను? ఏమని శాసించగలను?

"మేస్టారూ! టిఫిను తీసుకోండి!" అంటూ టిఫిను ముందు పెట్టిన నానిబాబు మాటలతో మళ్లీ ఈ లోకంలోకి వచ్చాను.

"ఇప్పు డివన్నీ ఎందుకోయ్! కాఫీ తాగే వచ్చాను" అన్నాను. కాని అతను వినలేదు. బలవంతం చేశాడు. తప్పేది లేదని టిఫిను తిని కాఫీ తాగాను. 'ఇంతటి భక్తి ప్రపత్తులు, వినయవిధేయతలు గల నానిబాబుని శంకించడమా?' అనుకుంటూ అతనిదగ్గిర సెలవు తీసుకొని బయటికి వచ్చేశాను.

ఆ తరవాత రెండుమూడుసార్లు నేను, మరికొంత మంది మేస్టార్లు బెజవాడ వెళ్లినప్పుడల్లా సినిమా చూసి నానిబాబు రూముకి వెళ్లి పడుకునేవాళ్లము. నానిబాబు మాకు పక్కలు వేసి, మంచం, చాప, దుప్పట్లు సర్ది సౌకర్యాలు చేసేవాడు. తెల్లవారితే ముఖాలు కడుక్కుని స్నానాలు చేసి వెళ్లిపోయేవాళ్లము. నాని



బాబుని ఆఖరిసారిగా నేను కలుసుకున్నది అతను ఇంటర్మీడియేటు రెండవ సంవత్సరంలో — డిసెంబరు నెలలో. ఆ రోజుకూడా మామూలుగానే నేను, మరో ఇద్దరు మేష్టార్లము కలిసి అతని రూముకి వెళ్లాము. తెల్లవారినపిమ్మట లేచి ముఖాలు కడుక్కుని వెళ్లబోయే ముందు నానిబాబుని పలకరించాను.

"ఏమోయ్! పరీక్షలు దగ్గిరికి వస్తున్నాయి! పాసా, క్లాసా?" అన్నాను నవ్వుతూ.

"అసలు పరీక్షకి వెడితే కదండీ పాసుకన్నా, క్లాసు కన్నా!" అంటూ బాధగా తల కిందికి దించేశాడు. అతని ముఖంలో ఏవో విషాదచ్ఛాయలు గోచరించాయి. అంతవరకు ఎప్పుడూ అతని ముఖంలో నవ్వుకళతప్ప విచారం అనేది చూసి ఉండలేదు.

"అదేం అలా అంటున్నావు! కొంపతీసి డిటెయిన్ చెయ్యలేదుగదా?" అన్నాను ఏదో తెలియని బాధతో.

"లేదు సార్! పరీక్షకు డబ్బు కట్టలేదు. రేపే ఆఖరిరోజు. ముప్పయి రూపాయలు తక్కువ అయ్యాయి. అమ్మా, నాన్న పంపలేకపోతున్నామని వ్రాశారు" అంటూ కంట తడి పెట్టాడు.

"అల్లాగా! అరే! అయితే నాతో ఇంతవరకు ఎందుకు

(తరువాయి 34 వ పేజీలో)

# ఋణవిముక్తి

(31 వ పేజీ తరువాయి)

చెప్పలేదు" అన్నాను ఏదో పెద్దతనంగా.

"ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో అని . . ." అంటూ నసిగాడు.

"భలేవాడివే! డబ్బు లేదని చెప్పి పైకి రావలిసిన వాడివి పరీక్ష మానేస్తావా? చాలువాళ్ళే! ఎంత తక్కువయిందన్నావు? ముప్ఫై కదూ! ఇదిగో! తీసుకో! ఈ డబ్బు పరీక్షకు కట్టేసి బాగా చదివి క్లాసు సంపాదించు! తెలిసిందా!" అంటూ మూడు పది కాగితాలు నానిబాబు చేతిలో పెట్టాను. ఆ సమయంలో నానిబాబు ముఖంలో వెలిగిన సంతోషకాంతి గది అంతా విరజిమ్మినట్లనిపించింది నాకు!

"థాంక్స్ అండి!" అంటూ ఆనందంతో జేబులో పెట్టుకున్నాడు నానిబాబు.

"బాగా చదువు!" అంటూ ధైర్యం చెప్పి నేను వచ్చేశాను.

• • •

అంతే! ఇది జరిగిన తరవాత నానిబాబుదగ్గిరికి వెళ్ళడమే పడలేదు. ఉద్యోగరీత్యా దూరానికి బదిలీ అవడమే దాని కొక కారణం! ఆఖరిసారి నానిబాబుని కలుసుకుని ముప్ఫైరూపాయలు ఇచ్చి ఇంటికి రాగానే నా మనసు అయిదారేళ్ళు వెనక్కిపోయింది. సరిగ్గా నా జీవితంలో జరిగిన ఘట్టం గుర్తుకు వచ్చింది. అవి నేను బందర్లో డిగ్రీ చదివేరోజులు! చదువుకున్న మనిషికి తెలివితేటలు, చురుకుతనము ఉన్నాయని మెచ్చుకునేవారు నన్ను లెక్చరర్లు! వీటన్నిటికిమించి కళాకండూతి—నాటకాల పిచ్చి ఒకటి ఉండేది నాకు! నాటకాల గురువుగారని ఓ తెలుగు లెక్చరరుగారుండే వారు! ఆయనకు నాటకాలంటే ఎంత ప్రాణమంటే ఇంట్లో భార్యదగ్గిరకూడా నాటకాల ఫక్కీలోనే డైలాగులు నడిపేవారు! అసలు మా రిహార్సల్సు కాలేజీలో కుదరకపోతే ఆయన గృహప్రాంగణంలోనో, వరండాలోనో జరిగేవి! ఆ సందర్భాల్లో జరిగిన రెండుమూడు ఘట్టాలు ఉదహరిస్తేచాలు మా గురువుగారి నాటకాల పిచ్చికి నిదర్శనానికి! ఓసారి మేం మా గురువుగారు వ్రాసిన నాటకమే రిహార్సలు వేస్తున్నాము. దాన్ని పరిషత్తు పోటీలకులాగే విశ్వవిద్యాలయంలో జరిగే అంతర కళాశాలల పోటీకి తీసుకెడుతున్నాము. రిహార్సలు మంచి రసపట్టులో ఉంది! అందులో కథానాయకుడు వచ్చే జీతంతో సంసారం నడపలేక అప్పుల పాలవుతాడు. కాలానికి తగ్గట్టు వేషభాషల్లోను, ఆడంబరాల్లోను, దర్పంలోను మునిగిపోయి తాహతుకు మించి ఖర్చు చేసేస్తూంటారు ఇంట్లోవాళ్ళు! దాంతో అప్పుల బాధ ఎక్కువవుతుంది! ఓ మిత్రుని సలహాపై లంచం తీసుకొంటాడు. ఈ విషయం తెలిసికొని ఆతని బావమరిది వచ్చి బావగారిని మందలించి సరిఅయిన మార్గంలో పెడతాడు. తగిన కర్తవ్య బోధ చేస్తాడు! అప్పుడు ఆ బావమందపాత్రధారి డైలాగుల్ని మా గురువుగారు ఆవేశంతో, అభినయంతో నటిస్తున్నారు! ఒకటి రెండుసార్లు చెప్పారు! నాటకం కంటిన్యూయిటీ కోసం రిహార్సలు మొదటినుంచి జరుగుతూంది! మధ్యలో మా గురువుగారి భార్య, "పిల్లలకు జాకెట్టు ముక్కలు తీసుకున్నాను. ఓ పదిరూపాయలు ఇవ్వండి!" అంటూ కేకవేసింది! అంతవరకు ప్రాక్టీసు ఇస్తున్న డైలాగుల్ని ఇంకా మనసులోనే ఉంచుకున్నారు గాబోలు మా గురువుగారు, మాకేం తెలుసును. వెంటనే భార్య నుద్దేశించి కోపంగా, "జాకెట్టు గుడ్డలు, లంగా గుడ్డలు, టెర్లిన్ చీరలు, నైలాన్ హోజీలు, పాండ్సు పౌడరుడబ్బాలు, స్నోలు — ఇవన్నీ ఎందుకు? ఇవి లేకపోతే గడవదా? ఎప్పుడో గొప్పగా బ్రతికామని ఇప్పుడూ బ్రతుకుదామంటే ఎలా? కాలాన్నిబట్టి మనం మారిపోతే ఎలా! మన అవసరాల్ని అదుపులో పెట్టుకోకపోతే ఎలా?" అంటూ తీవ్రంగా భార్యకేసి చూశారు! ఆ ఇల్లాలు అంత వయస్సు వచ్చినా, బిక్కచచ్చిపోయి బెదిరిపోయి చూస్తూంది అర్థంకాక! మేమంతా కొయ్యబారిపోయాము. ఇంతలో, "రాజా! ఇలా ఉండాలోయ్ డైలాగు! ఇంత పవర్‌ఫుల్‌గా ఉండాలి స్పీచి" అని, "ఓసి, పిచ్చిమొహమా! నిన్నుకాదే! ఇది డైలాగు చెప్పే పద్ధతి, రిహార్సల్సు. తెలిసిందా! పో! పర్సులో ఉంది డబ్బు" అంటూ భార్య నుద్దేశించి పలికారు. ఆవిడ ఒక్కసారి గొల్లుమన్నంత పనిచేసి లోపలికి వెళ్ళిపోయింది. ఆ దెబ్బలోంచి తేరుకునేసరికి మాకు అయిదు నిమిషాలు పట్టింది.

ఇలాంటి నాటకాల గురువుగారికి నేను నచ్చిన ప్రథమ శిష్యుణ్ణి అయ్యాను. "ఇది కళాకండూతి, నాయనా! దురదపెట్టినపుడు గోకినంతసేపూ బాగానే ఉంటుంది. కాని ఆ తరవాత ఉంటుంది అసలు మంట" అంటూ ఉండేవారు. ఆయన మాటల్లో అర్థం నా కప్పుడు బోధపడలేదు. కాని తరవాత తరవాత అర్థమయింది. అలాగే అయింది నా పని! నాటకాలపిచ్చిలో చదువు తగ్గిపోయింది. డిసెంబరునెల. పరీక్షఫీజు కట్టవలిసిన టైము. ఇంటిదగ్గిరనించి నాన్న పంపే సొమ్ము—అతికష్టంమీద పంపే సొమ్ము —(సంసారం పెద్దది. ఏం చేస్తాడు నాన్నమాత్రం?) నా ఖర్చులకు సరిపోయేదికాదు. అందుకని జీతాలు కట్టవలిసిన డబ్బు కొంత వాడేశాను. దాన్ని భర్తీ చేయడానికి పరీక్ష ఫీజు తాలూకు సొమ్ము కొంత వాడాను. ఏతావతా తేలిందేమిటయ్యా అంటే పరీక్షకు కట్టాల్సిన ఫీజు తాలూకు సొమ్ములో ముప్ఫైరూపాయలు తక్కువయ్యాయి. ఏం చేయడానికి తోచలేదు. పరీక్ష పాసయినా, మానినా పరీక్షకు హాజరవాలంటే ఫీజు కట్టాలి! ఏ ఫ్రెండ్సునన్నా అడుగుదామంటే నెలాఖరురోజులు. పైగా, అయిదూ పదీకాదు. ముప్ఫైరూపాయలు! ఆఖరికి ఓ ఆలోచనతట్టి గురువుగారిదగ్గిరికి వెళ్ళాను ఆయనదగ్గిర ఉండే చనువుకొద్దీ!

"మేస్టారూ! మీరో సహాయం చేసిపెట్టాలి!" అన్నాను తల కిందికి దించి నేలకేసి చూస్తూ, కాలి బొటనవేలితో నేలమీద సున్నాలు చుడుతూ.

"ఏం? ఏం వచ్చిందోయ్, అంత ప్రమాదం!" అన్నారు నవ్వుతూ ఆయన.

"పరీక్షఫీజు కట్టాలి! ముప్ఫై రూపాయలు తక్కువైంది. ఇంటిదగ్గిరనించి రావటం ఆలస్యమవుతూంది! టైము లేదు" అన్నాను.

"సరే! అయితే ఇప్పుడు నా దగ్గిర డబ్బు లేదు! చెక్కు రాసి ఇస్తాను. బ్యాంకులో తెచ్చుకో" అని ఓ చెక్కు రాసిఇచ్చారు. బ్రతుకుజీవుడా అని ఆ చెక్కు తీసుకొనివెళ్ళి మార్చుకుని ఆ సొమ్ముతో ఫీజు కట్టేశాను. ఆ తరవాత నాటకాల పోటీలకు వెళ్ళాము. తిరిగి వచ్చాము. రోజులు గడుస్తున్నాయి. ఇంటిదగ్గిరనించి నెలనెలా వచ్చేసొమ్ము సరిపోతూంది. కాని . . . కాని . . . గురువుగారి బాకీ తీర్చలేదు. ఇంతలో పరీక్షలకు ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేశారు. దాంతో గురువుగారిని కలుసుకునే అవకాశాలు తగ్గాయి. పరీక్షలు రానే వచ్చాయి. అయిపోయాయి. ఒకటో రెండుసార్లు గురువుగారు కనిపించినా ఆ విషయం ప్రస్తావన లేదు. తరవాత తరవాత నాకే మొహం చెల్లక మొహం చాటేశాను. అంతే! పరీక్షల తరవాత మళ్ళీ ఆయన్ని కలుసుకోలేదు. పరీక్షల ఫలితాలు వచ్చాయి. ఎలాగో పాసయ్యాను. వెంటనే ట్రైనింగుకు వెళ్ళిపోయాను. పూర్తి చేశాను. ఉపాధ్యాయవృత్తి స్వీకరించాను. సంపాదనలో పడ్డాను. అయినా గురువుగారి ఋణం తీర్చలేకపోయాను. సంసారం ఏనెల కానెల ఏదో ఇబ్బంది . . . గురువుగారి కబుర్లు ఏం తెలియలేదు. ఆయనకు ఋణగ్రస్తుడి నయ్యాననే బాధతోబాటు మానసికవ్యథ నన్ను పీడిస్తూనే ఉంది! ఉండబట్టలేక గురువుగారిని గురించి వాకబు చేశాను. ఆయన అక్కడినించి మరో కాలేజీకి వెళ్ళిపోయారని తెలిసింది. ఎడ్రసుకోసం ఎంతో ప్రయత్నించాను. దొరకలేదు. ఉన్నట్టుండిఅకస్మాత్తుగా పేపర్లో ఆయన ఎడ్రసు దొరికింది. ఆయన వ్రాసిన పుస్తకానికి ఏదో బహుమతి లభించింది. అక్కడే ఎడ్రసు దొరికింది. ఆనందోత్సాహంతో కాగితం కలం తీసి ఆయనపేర ఓ లేఖ ఇలా వ్రాశాను:

"పూజ్యులైన గురువుగారికి,

వందన శతకాలు! ఈ శిష్యపరమాణువు తమకు గుర్తు ఉండి ఉండకపోవచ్చును గాని పీడి కిచ్చిన ఋణము మీకు తప్పకుండా జ్ఞాపకం ఉండిఉంటుంది. ఆనాడు మీరు ఆదుకుని నాకా సహాయం చెయ్యకపోతే నా పరీక్ష ఏమయ్యేదో! నా జీవితపంథా ఎట్లా మారేదో! మీ దయవల్ల నేను ఉద్యోగంలోకూడా చేరాను. ఇంతవరకు మీ రిచ్చిన సొమ్ము నేను తిరిగి ఇవ్వలేకపోయినందుకు క్షంతవ్యుడను. ఆనాడు మీనుంచి సొమ్ము తీసికోవటంకోసం ఇంటిదగ్గిరనించి సొమ్ము రాలేదని చెప్పిఉన్నాను. అది అబద్ధం. సొమ్ము వచ్చింది. ఖర్చుచేసేశాను. మిమ్ములను మోసగించి, మాయ మాటలతో నమ్మించి ఆ సొమ్ము తీసుకొన్నందుకు నేనెంతో బాధపడుతున్నాను. యథార్థ విషయం చెబితే పని జరగదేమోనన్న మానసిక భయంతో అలా ప్రవర్తించానుకాని మిమ్ములను నమ్మించి, మోసగించి, ద్రోహంచెయ్యాలనే తలంపుతోకాదు. మీపై నాకు ఉన్న గౌరవాభిప్రాయాలు ఇంక ఎవరిపైన లేవని నొక్కి చెప్పగలను. కావున నాయందు దయఉంచి

> **నేరస్థుడు**
>
> నేరాన్ని తయారుచేసేది సంఘం; చేసేది నేరస్థుడు.
>
> —అల్ఫ్రీడ

నన్ను మన్నించానని జాబు వ్రాస్తేనేకాని నా మనసు శాంతపడదు. మీ జాబు చూడగానే మీరిచ్చే సరియైన ఎడ్రసుకు ఆ సొమ్ము పంపగలను. మీ దయవల్ల నేను నా కాళ్లపై నిలబడగలశక్తి సంపాదించు కున్నాను. అందులకు మీకు కృతజ్ఞుడను. సొమ్ము రూపేణా మీరిచ్చిన ముప్ఫై రూపాయలను మీకు తిరిగి ఇస్తేనేగాని నేను ఋణవిముక్తుణ్ణికాను. దయతో జాబు వ్రాయగలరు.

సెలవు

మీ శిష్యపరమాణువు."

ఉత్తరం పోస్టుచేసి వచ్చాక హృదయంమీదనించి పెద్దబరువు దించినట్లు భావించసాగాను. . నాలుగైదు రోజులల్లో ఆశించినట్లుగానే మా గురువుగారి దగ్గరనించి జాబు వచ్చింది ... నా ఆనందానికి అంతులేదు. ఆత్రంగా కవరు చింపి చదవసాగాను.

"శ్రీ రస్తు చిరంజీవికి,

ఆశీస్సులు! నీ లేఖ అందినది. ప్రభుత్వ బహుమతి ప్రదానముకంటె నీ లేఖ నా హృదయమును ఎక్కువగా కరిగించినది. క్షమించమని వ్రాశావు. నా దృష్టిలో నీవేమీ నాకే అపకారం చేయలేదు...

ఋణం తీర్చుకుంటానని వ్రాసినావు. నిజానికి ఆ విషయం నా మనస్సులోలేదు. . ఎప్పుడైనా నేను విచారిస్తే, అది డబ్బు విషయంకాదు. . . నా డబ్బు ఏమీ దుర్వినియోగం కాలేదని నాకు తెలుసు. ఒక కళ ఒక యువకునకు అవసరమయ్యే సమయంలో —అది ఏ మాత్రమైనా ఉపయోగించి ఉన్నట్లయితే అంత కంటె నా జీవితానికి ధన్యత్వం ఏ ముందాలి? . . ఆ సంఘటనలవల్ల నా కేమి నష్టములేదు ... నాకు పోయిందేమీలేదు సరిగదా. ఈలాటి పనులు ఇంకా ఎన్నో చేసి నీ శీలం పాడుచేసికొంటున్నావేమోనని నేను ఒకసారి విచారించాను. కాని ఆ విషయం నీతో చెప్పితే నన్ను అపార్థం చేసుకోవచ్చు . . . మౌనమే శరణ్య మయింది నాకు. . .

కాని. . ఈ నాడు నీ లేఖవల్ల నాకు ఆ బెంగకూడా తుడిచిపెట్టుకుపోయింది. వర్థిష్ణువు రచయిత, కోమల మనస్కుడు అయిన యువకుడు చెయ్యకూడని పని అని నాలో నేను ఒకసారి అనుకొని మరిచిపోయాను. అంతే! అదీగాక డబ్బు ఇబ్బంది అంటే ఏమిటో అర్థం చేసుకోలేని కఠినాత్ముడను మాత్రంకాను...

నీమీద నాకుగల సదభిప్రాయం ఏ మాత్రం పోలేదు . . . అదీగాక ఇప్పుడు నీ లేఖవల్ల ఆ సదభిప్రాయం ఇనుమడించింది.

పశ్చాత్తాపంతో చెమ్మగిల్లిన కన్నులనుండి యువకుడు జార్చే కన్నీటిబిందులతో తళతళలాడే పవిత్ర సౌందర్యంకంటే రసమయ దృశ్యం పృథివిలో వేరొకటిలేదు. . నీ ఈ పశ్చాత్తాపం నిన్ను పవిత్రుణ్ణి చేసింది. . నేను నిన్ను ఏనాడో క్షమించివేశాను . . .

ఇక నీవు నీ రెక్కలమీద నిలబడగలిగిననాడు చెయ్యవలసిన పని ఋణము తీర్చడంకాదు. ఒకవేళ నీవు ఆ సొమ్ము ఈనాడు తిరిగి ఇచ్చేస్తే ఋణవిముక్తి కలుగుతుందా? ఆలోచించుకో! —చెయ్యవలసిన పని అదికాదు. నీవు కూడా ఉపాధ్యాయపదవిలో ఉంటున్నావు. ఏ పదవిలోనైనా ఉండు. క్లిష్టపరిస్థితిలోఉన్న యువకుణ్ణి కనిపెట్టి, సానుభూతితో ఆ మేరకైనా —నిర్హేతుక జాయమాన కరుణతో సాయం చెయ్యి. ఎప్పుడైనా ఏ యువకుడైనా నీలాగే ప్రవర్తిస్తే అపార్థం చేసుకోక సానుభూతి చూపించు. ఆ నాడు నీకు ఋణవిముక్తి కలుగుతుంది! నేను నీ దగ్గరనుండి ఆశించేది దమ్మిడీకూడా లేదు. మరిచిపోవద్దు. నీ శీలం కూడా పవిత్రమైనది కనక నాకు అసలేమీ బాధలేదు. అదీగాక. . ఒక విద్యార్థికి జీతం కట్టేందుకు వెచ్చించిన రూపాయికిఉన్న విలవ — ఆతన్ని సినిమాకు తీసుకొని పోయేందుకు వెచ్చించే రూపాయిలో ఉండదు. నీవు తీసికొన్న సొమ్ము ఆ నాడు ఇవ్వలేక పోవటమే నిజమైతే నిజమనే నేను విశ్వసిస్తున్నా! ఆ నాడు పుచ్చుకున్న రూపాయికిఉన్న విలవ ఈ నాడు ఇచ్చే రూపాయికిలేదు. ఎప్పుడు ఉంటుందంటే, నేను కూడా నీవంటి నిస్సహాయస్థితిలోనే ఉండాలి! నాకే తిరిగి ఇవ్వాలని నీవు వాంఛించటంవల్ల నన్ను గూడా అట్టి స్థితికి రావాలని కోరుకోవటమే అవుతుంది. నీకుగాని నాకుగాని అట్టి స్థితి వాంఛనీయంకాదు. అందుచే నీ స్థితి చక్కబడుగాక! —చక్కబడిన తరవాత కనిపెట్టి అవసరంలోఉన్న అప్పుణ్ణి ఆదుకో! —నీవు ఋణ విముక్తుడవు కాగలవు!

నీకు ఉజ్జ్వల భవిష్యత్తు చే కూరుగాక!

భవదీయుడు. . ."

ఈ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నానో, ఎంతగా కంఠస్థం చేశానో చెప్పటం కష్టం! నాటి నుంచి నేటి వరకు కూడ ఆ ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా భద్ర పరుచుకుంటూ వస్తున్నాను. అంతే! ఆ లేఖ తరవాత గురువుగారు ఎన్నిసార్లు డబ్బు పంపుతానన్నా తీసుకోవని నిష్కర్షగా వ్రాశారు! అయినా పంపి చూద్దామని పంపాను. తిరిగి వచ్చేసింది .. 'భగవాన్! ఏది గత్యంతరం? నే నిలా ఋణగ్రస్తుడుగా ఉండవలసిందేనా! నా కీ ఋణ విముక్తి కలిగే యోగ్యత లేదా? అని ఎంతగానో పరిత పించేవాణ్ణి. అలాంటి దిప్పుడు నాని బాబు నా జీవితంలో ప్రవేశించటం—ఆతనికి ఈ పరిస్థితుల్లో ముప్ఫై రూపాయలే, సరిగ్గా అంతే సొమ్ము సహాయం చేయడం చాలా విచిత్రంగా జరిగిపోయింది. విధి విలా సమేరీతిని వర్ణించగలము? ఒక్క రూపాయ కూడా ఎక్కువ తక్కువ లేకుండా సరిగ్గా ముప్ఫై రూపా యలు! కారణం ఒక్కటే. ఫలితం? ఊహించలేక పోయాను ఆ నాటిరాత్రి!

> **పొగడ్తలు**
>
> న్యాయస్థానం దుస్తులు ధరించిన అసత్యాలే పొగడ్తలు.
>
> —సైర్లింగ్

ఆ తరవాత తరవాత నానిబాబు సంగతి నాకు తెలియలేదు. కాని కర్ణాకర్ణిగావిన్నదాన్నిబట్టి చాలా బాధ పడ్డాను. పరీక్ష తప్పాడని, చదువు మానేశాడని, తన వాటా పొలం అమ్మేసి సినిమా కంపెనీల్లో చేరాడని, డబ్బు అంతా ధ్వంసం చేసేశాడని — ఇంకా, ఇంకా ఎన్నో వింటూవచ్చాను. మనసులో ఏదో బాధ పొందాను. అతనికి నాకు ఏ సంబంధం అంటే సమాధానం చెప్ప లేను! కేవలం గురుశిష్య సంబంధమయితే అంతగా ఉండదేమో! ఏమో! ఏం చెప్పగలను? ఆతను తన జీవితాన్నంతా నాశనం చేసేసుకున్నాడని విన్నప్పుడు నా జీవితమే నాశనమయిపోయినట్లు విచారించాను. ఆతనో పెద్ద డాక్టరవుతాడని, నా వృద్ధాప్యంలో ఆతని దగ్గరే వైద్యం చేయించుకోవాలని — ఏ మేమో అనుకున్నాను. అన్నీ నాశనమయిపోయాయి. మళ్లీ నానిబాబు నాకు కనిపించలేదు . . . ఏళ్లు గడిచిపోతూనే ఉన్నాయి!

● ● ●

"సార్! ఓ టెన్ ఎన్పీ ఉంటే ఇప్పిస్తారూ! కాఫీకి తక్కువయాయి. ." అంటూ హైదరాబాద్ కోటీ సెంటర్లో వంగుని కూరలు కొంటున్న నన్ను ఎవరో తట్టి పిలిచేసరికి ఉలిక్కిపడి పైకి నిలబడ్డాను. క్షణంలో నన్ను తట్టి పిలిచిన మనిషి నా కళ్లలోకి చూసి ఖంగారుపడుతూ "మీరా మాస్టారూ!" అంటూ గిరుున వెనక్కి తిరిగి జనంలోకి దూసుకు పోయాడు. నా కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి."

"నానిబాబూ! . . . నానిబాబూ!" — అంటూ కేకలు పెడుతూ వెంబడించాను. కాని ఏం లాభం? మహా జనం! సాయంత్ర సమయం! క్రిక్కిరిసిన జనం సందడి! లాభం లేకపోయింది! చేతికి దొరికిన వస్తువు చేతిలో నించే జారిపోయింది. ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు మళ్లీ కనిపించాడు! మనసారా — తనివితీరా నా శిష్యుణ్ణి మాట్లాడిద్దామని — మాట్లాడదామని ఆశించేటంత లోగానే మాయమయిపోయాడు! పాపం! హైద్రాబాదు ఎల్లా చేరాడో! ఇలా రోడ్లమీద అడుక్కుతినే స్థితికి దిగజారాడన్నమాట! ఎలాటివాడికి ఎలాంటి గతి పట్టింది! విధిలిఖితాన్ని దాటటం ఎవరికీ తరంకాదు! నానిబాబు ఇక్కడే ఉంటున్నాడన్నమాట! మళ్లీ ఎక్కడో తారసపడచ్చును. ఆ రోజునుంచి ప్రతిరోజు — అక్కడున్నన్నాళ్లు — ఒళ్లంతా కళ్లు చేసికొని నానిబాబు కోసం వెతుకుతూనే గడిపాను. సెలవులయి పోవడంతో ఉద్యోగధర్మ ప్రకారం తిరిగి వచ్చేశాను. కాని నానిబాబు కనపడలేదు! ఆనాటినించి ఈనాటి వరకు నానిబాబు స్మృతిపథంలోను ఊహాచిత్రం లోనుతప్ప, వాస్తవిక జగత్తులో నాకు కనపడలేదు. నానిబాబు కేవలం నా ఊహాజనిత వ్యక్తిగా మాత్రమే తయారయాడు! ఇక నానిబాబు తలపుల్లోనే నాకు సాక్షాత్కరించసాగాడు!

● ● ●

ఇందుకే నానిబాబు గుర్తు వచ్చినప్పుడల్లా నా మనస్సులో కలిగేభావాలు, అనుభూతులు అన్నీ ఇన్నీ కాదు! అయినా ఆశ మాత్రం పీడిస్తూనే ఉంది! ఎప్పటికైనా నానిబాబు తిరిగి వస్తాడని —నాకు కనిపిస్తాడని — ఏది ఏమైనా నాని బాబు మాత్రం నన్ను ఋణవిముక్తుణ్ణి చేశాడు. తాను ఋణగ్రస్తు డయ్యాడు! అసలు ఈ ప్రపంచంలో ఇలాగే ప్రతి ఒక్కడూ ఎవరినో ఒకరిని ఋణవిముక్తుణ్ణి చేసి, తాము ఋణగ్రస్తులవుతూంటారేమో! ఋణగ్రస్తు లగుట ఋణవిముక్తులగుట — ఈ రెండు ఒకదాని వెంబడి ఒకటి చక్రీయన్యాయంలో పరిభ్రమిస్తూ మానవులతో ఆటలాడుకుంటాయేమో! — హే భగవాన్! నీ లీలలెంత చిత్రములయ్యా! నీ శక్తి సామర్థ్యాలు తెలుసుకోవటం నావల్లకాదు! అయినా నాదొక్క ప్రార్థన! ప్రభూ! — నా నానిబాబుని ఎప్పుడైనా నాకు కనపడేలా చెయ్యి. అదే నాకు చాలు. ఇదే అందుకు వేడికోలు! అందుకో! ★